క్లుప్తంగా

నేడు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వర్ధంతి



వెంకటగిరి రూరల్/వాకాడు: మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వర్ధంతిని శుక్రవారం వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంతోపాటు వాకాడులోని రామ్‌కుమార్‌రెడ్డి స్వగృహంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు నేదురుమల్లి కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, నేదురుమల్లి అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రూ.50 వేల ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

చిల్లకూరు: గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న చేడిమాల గ్రామానికి చెందిన పండ్లూరు అచ్చెమ్మకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు గురువారం రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. వైద్యం చేయించుకునేందుకు స్థోమత లేక ఇబ్బంది పడుతున్న ఆమె పరిస్థితిని కుటుంబ సభ్యులు ట్రస్టు ఫౌండర్ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సాయం అందించారు.

సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో కార్ల ప్రదర్శన

గూడూరు రూరల్: గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గురువారం ప్రయివేటు కంపెనీకి చెందిన కార్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏదైనా కార్యక్రమం నిర్వహించాలంటే సబ్ కలెక్టర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతి లేకుండానే కార్ల ప్రదర్శన ఏర్పాటుచేసి విక్రయాలు చేపట్టడంపై పలు విమర్శలు వెల్లువెత్తాయి.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

సైదాపురం: మండలంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఆయన గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం చాగణం, 11న కలిచేడు సచివాలయంలో ఆధార్ కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లారీ బోల్తా

రాపూరు: మండలంలోని సైదాదుపల్లి టోల్ ప్లాజా సమీపంలో గురువారం తెల్లవారు జామున కూల్ డ్రింక్స్ లారీ బోల్తా పడింది. శ్రీకాళహస్తి నుంచి పోరుమామిళ్లకు కూల్ డ్రింక్స్ తీసుకెళుతుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడిందని తెలిపారు. ఎవరికీ గాయాలు కాలేదు.

ఆగివున్న లారీని ఢీకొన్న మరో లారీ

పెళ్లకూరు: మండలంలోని కొత్తూరు వద్ద గురువారం ఆగివున్న లారీని మరో లారీ ఢీకొంది. దీంతో క్లీనర్ గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. లారీ పుంగనూరు నుంచి టమాటా కాయలతో కోల్‌కత్తా వెళుతోంది. పెళ్లకూరు మండలం కొత్తూరు గ్రామం వద్ద రోడ్డు పక్కన ఆగివున్న లారీని ఢీకొంది. టమాటా లారీలోని క్లీనర్ కార్తికేయన్‌కు గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉచిత ఖత్నాలు


ఖత్నాలు చేయించుకున్న పిల్లలకు మందులు, పండ్లు అందజేస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బాషా గ్రూపు విద్యా సంస్థల డైరెక్టర్ షేక్ రఫీ బాష ఆధ్వర్యంలో గురువారం 76 మంది పిల్లలకు ఉచితంగా ఖత్నాలు చేసినట్టు ప్రిన్సిపాల్ హమీద్ తెలిపారు. వెంకటగిరికి చెందిన వైద్యులు షాజహాన్ ఉచితంగా మందులు, పండ్లు పంపిణీ చేశారు. పిల్లలతో పాటు వచ్చిన వారికి భోజన వసతి కల్పించారు. రఫీబాష సొంత నిధులతో ప్రతి ఏటా ఉచితంగా ఖత్నాలు చేయిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో మౌలానా అబూబకర్, మౌలానా అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

భక్తవత్సలా.. పెనుశిల నృసింహా

- దేవదేవేరులతో కలిసి కోనకు చేరిన లక్ష్మీనరసింహుడు
- గోనుపల్లిలో పండుగ వాతావరణం
- వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు


విశేషాలంకరణలో స్వామి అమ్మవార్లు


స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకెళుతున్న గ్రామస్తులు

రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారు ముందుగా అత్తగారి ఇల్లయిన గోనుపల్లి నుంచి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీతో కలిసి కోనకు చేరుకోవడంతో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమైనట్లు ఆలయ ప్రధాన అర్చకులు పెంచలస్వామి, సీతారామయ్యస్వామి తెలిపారు.

పెళ్లి కొడుకైన పెంచలస్వామి

హిరణ్యకసిపుని వధానంతరం ఉగ్రరూపుడైన స్వామివారు నరసింహ అవతారంలో వెలుగొండలలో సంచరిస్తుండగా చెంచురాజు కుమార్తె చెంచులక్ష్మి చెలిమితో శాంతించారు. నృసింహుడు ఆమెను వివాహమాడినట్లు పురాణాలు చెబుతున్నాయి. గోనుపల్లిలోని విగ్రహాలకే పెంచలకోనలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ప్రతి ఏటా గోనుపల్లిలో పెంచలనరసింహస్వామి పెళ్లి కొడుకై ఉదయం గోనుపల్లి గిరిజన కాలనీకి రావడం ఆనవాయితీగా సాగుతోంది. గిరిజనులు సంప్రదాయబద్ధంగా అల్లుడికి, కుమార్తెకి (స్వామి, అమ్మవార్లకు) ఆతిథ్యం ఇచ్చి పూజలు చేశారు. స్వామివారికి ఆహారం, ఇతర లాంఛనాలు అందించేందుకు తెల్లవారు జామునే అడవికి వెళ్లి పుట్టతేనె, ఇంజేటిగడ్డలు, సారపప్పు, పెడ మల్లెపూలు, బందారు ఆకులతో భాషికం, ఎల్లగడ్డలు, తంగేడుతో తాళిబొట్టు, స్వామివారికి కట్నంగా ఇచ్చే ఆరినార మొలతాడును అందజేసి సాంగ్యం చెల్లించారు. స్వామివారికి టెంకాయ, కర్పూరం, వడపప్పు, చీర, రవిక సమర్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటి గుమ్మం వద్ద తోరణాలతో ప్రత్యేక చలువ పందిళ్లు ఏర్పాటు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

గొల్లబోయికి తొలి దర్శనం

పెనుశిల లక్ష్మీనరసింహస్వామి గ్రామానికి వచ్చిన తొలిసారి గొర్రెల కాపరి గొల్లబోయికి దర్శనం ఇవ్వడం ఆనవాయితీ. శ్రీవారు అప్పట్లో గ్రామానికి చేరుకున్నప్పుడు తమ మహిమలను గురించి గ్రామస్తులకు వివరించి తనకు ఆలయం నిర్మించమని చెప్పి గొల్లబోయిని వెనుదిరిగి చూడకుండా వెళ్లమని ఆదేశించారని ప్రతీతి. మార్గమధ్యంలో గొల్లబోయి వెనుతిరిగి చూడడంతో లక్ష్మీనరసింహుడే గొల్లబోయి శిలారూపం దాల్చారని పురాణాలు చెబుతున్నాయి. ఏటా శ్రీవారు సతీసమేతంగా గొల్లబోయికి తొలి దర్శనమిచ్చి అనంతరం కోనకు చేరుకుంటారు. పెంచలకోనలోని క్రేన్ మండపంలో స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ డీసీ శ్రీనివాసులురెడ్డి, ఫెస్టివల్ కమిటీ సభ్యు లు చెన్ను తిరుపాల్‌రెడ్డి, సోమయ్య, ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి పాల్గొన్నారు.

బ్రహోత్సవాలకు అంకురార్పణ

పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామికి గురువారం అంకురార్పణతో వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనాయి. రాత్రి 7 గంటలకు అనుజ్ఞ, వేదస్వస్తి, విశ్వక్సేనారాధన, పుణ్యాహ వచనములను ఆగమోక్తంగా నిర్వహించారు. రాత్రి 9 గంటలకు స్వామివారి అలంకార మండపంలో అంకుర్పారణ నిర్వహించినారు.


శ్రీవారికి అడవి గడ్డలు తీసుకువస్తున్న గిరిజనులు


ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు


స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం

20 లోపు అన్నదాత సుఖీభవకు దరఖాస్తులు

దొరవారిసత్రం: మండలంలోని రైతులు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద 2025–26 ఏడాదిగాను రూ.20 వేలు పొందేందుకు ఈ నెల 20వ తేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏవో జ్యోతిర్మయి తెలిపారు. ప్రస్తుతం సొంత భూమి కలిగిన, ఆర్‌వోఎఫ్‌ఆర్ రైతులకు మాత్రమే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆధార్, పొలం పాస్ బుక్ మొబైల్ నంబర్ ఇవ్వాలని సూచించారు.

నేటి నుంచి యోగ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

దక్కిలి: మండలంలోని వెంబులూరు పంచాయతీలోని వెలుగొండలు కింద వెలసిన యోగ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి 11వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు విజయ్‌కుమార్, సుబ్బారావు తెలిపారు. శుక్రవారం ఉదయం వేదస్వస్తి, పుణ్యాహవచనం, ధ్వజారోహణం చేపడతామని తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటలకు స్వామి వారి కల్యాణం, తెప్పోత్సవం ఉంటాయని వివరించారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

చిట్టమూరు: నాయుడుపేట మండలం గొట్టిప్రోలు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.రవీంద్రయ్య తెలిపారు. 3 నుంచి 9వ తరగతి వరకు 133 సీట్లు ఉన్నట్టు తెలిపారు. గిరిజన బాలుర విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9491435025లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

- హెచ్చరిక బోర్డు తొలగింపు
- యథేచ్ఛగా భూమి చదును పనులు
- అడ్డుకున్న ప్రజలు


హిటాచీని అడ్డుకుంటున్న గ్రామస్తులు

కలువాయి(సైదాపురం): అధికారం అండతో కూటమి నేతలు గురువారం కలువాయి మండలం తెలుగురాయపురంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. వారిని స్థానికులు అడ్డుకున్నారు. తెలుగురాయపురంలో 130 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దాన్ని ఆక్రమించుకునేందుకు కూటమి నేతలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. దీనిపై ఏప్రిల్ 25న బాబోయ్.. భూచోళ్లు అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. అందులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. దాన్ని కూటమి నేతలు బుధవారం తొలగించి హిటాచీతో చదును చేసేందుకు ప్రయత్నించారు. స్థానికులు గుర్తించి తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వారు స్పందించలేదు. గురువారం తెలుగురాయపురం సర్పంచ్ రమణమ్మ, మాజీ ఎంపీటీసీ బి నారాయణరెడ్డితో పాటు మరో 150 మంది ప్రజలు హిటాచీని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న వీఆర్వో అక్కడికి చేరుకున్నారు. పనులు చేయవద్దని ఆపరేటర్ ఆదేశించారు. అతను ఎమ్మెల్యేతో మాట్లాడుకోవాలని, తాను పని ఆపేది లేదని తేల్చి చెప్పారు. దీంతో గ్రామస్తులు పోరాటం చేయడంతో అతను పనులను నిలిపివేశాడు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా పోలీసులకు ఫిర్యాదు చేయమని వీఆర్వోను ఆదేశించినట్టు తెలిపారు.

పది రెమెడియల్ క్లాసుల పరిశీలన

తడ: ఈ ఏడాది పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న రెమెడియల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మల్లికార్జున తెలిపారు. ఆయన గురువారం మాంబట్టు ఉన్నత పాఠశాలలో సోషల్ సబ్జెక్టుకు సంబంధించిన రెమిడియల్ క్లాసులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఏడాది వృథా కాకుండా ఇంటర్‌లో చేరేందుకు ఈ తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

కండలేరులో 44.760 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 44.760 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 850, పిన్నేరు కాలువకు 50, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పలువురికి పరామర్శ


తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డితో మాట్లాడుతున్న సంజీవయ్య


మస్తానయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ

చిల్లకూరు: గూడూరు మున్సిపల్ మాజీ చైర్మన్ పోలిపాటి మస్తానయ్య కొడుకు విజయకుమార్ ఇటీవల మృతిచెందాడు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ గురువారం మస్తానయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోదండరామయ్య, రూపేష్‌రెడ్డి, పూర్ణచంద్ర, బి.గోపీయాదవ్, పి.రమేష్‌యాదవ్, మణి పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: కంటి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డిని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, కలికి మాధవరెడ్డి, ఒట్టూరు కిషోర్ యాదవ్, పాదర్తి హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

దక్కిలిలో..


ఖాదర్‌బాషాతో మాట్లాడుతున్న మస్తాన్ యాదవ్

దక్కిలి: నాగవోలు పంచాయతీ చెన్నసముద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సయ్యద్ ఖాదర్ బాషా తల్లి ఇటీవల మృతిచెందారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బొలిగర్ల మస్తాన్ యాదవ్ చెన్నసముద్రం వెళ్లి ఖాదర్ బాషా కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.5 లక్షలు


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది, అధికారులు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతరను ఘనంగా నిర్వహించడంపై అధికారులు, నాయకులకు దేవాదాయ శాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీరివాసబాబు కృతజ్ఞతలు తెలిపారు. వెల్లడించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. హుండీల్లో రూ.4,23,017, రూ.100 టికెట్ల ద్వారా రూ.76,100, కానుకల ద్వారా రూ.2,373లు మొత్తం రూ.5,01,490 వచ్చిందని వివరించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఈవో రవికృష్ణ, జాతర కమిటీ అధ్యక్షుడు నానబాల సుబ్బారావు, పెదకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు గాదిరెడ్డి గోపి, బీఎల్ శ్రీనివాసులు, శ్యామ్, ఆకుల కుబేరు మణి, వినుకొండ ధనుంజయ, పోలేరమ్మ ఆలయ మాజీ చైర్మన్ గంధవల్లి సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు. జాతర వేడుకల్లో భాగంగా గడియారం సెంటర్ వద్ద ఉన్న పోలేరమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్టు ఈవో తెలిపారు. పారిశ్రామికవేత్త పెసల జయపకాష్ శెట్టి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఉపాధిలో గిరిజనులకు ఎక్కువ అవకాశాలు

చిల్లకూరు: ఉపాధి హామీలో గిరిజనులకు ఎక్కువ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏపీవో గిరిబాబు తెలిపారు. ఆయన గురువారం పారిచెర్లవారిపాళెం, చేడిమాల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులకు ఉపాధి కల్పించేలా చెరువుల్లో ఫిష్ పాండ్‌లు తవ్వుతున్నట్టు తెలిపారు. తద్వారా వారు చేపలు పెంచుకుని జీవనోపాధి పొందుతారని వెల్లడించారు.

అటవీ ప్రాంతంలో మొక్కల పెంపకం

సైదాపురం: నెల్లూరు జిల్లాలోని రిజర్వు ఫారెస్ట్‌లో మొక్కల పెంపకం చేపడుతున్న రేంజర్ మాల్యాద్రి తెలిపారు. ఆయన గురువారం సైదాపురం సమీపంలోని సెంట్రల్ నర్సరీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సెంట్రల్ నర్సరీలో 2 లక్షల మొక్కలు పెంచుతున్నట్టు తెలిపారు. ఇక్కడి ప్రజలకు ఆగస్టులో 50 వేల మొక్కలు అందజేసి నాటి సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అదేవిధంగా అక్రమ మైనింగ్‌ను నిరోధించేందుకు ప్రత్యేక కందకపు పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. సెక్షన్ అధికారి శ్రీనివాసులు, బీవో రవిశేఖర్ పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

నాయుడుపేట టౌన్: రీసర్వేతో రైతుల భూ సమస్యలకు సత్వరం పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ మాగర్ల రాజేంద్ర తెలిపారు. ఆయన గురువారం పుదూరులో గ్రామసభ నిర్వహించారు. రీ సర్వేలో రైతుల భూముల వివరాలు, ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు తదితరాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పిలాస మణి, మాజీ ఉప సర్పంచ్ గోనుపల్లి గురుమూర్తి, డివిజనల్ సర్వేయర్ హరోహర, మండల సర్వేయర్ చరణ్ పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


మదర్ అకాడమీ ఫంక్షన్ హాల్లో వధూవరులను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో వధూవరులను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి (సైదాపురం) : పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో గురువారం వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ పులుకొల్లు రామారావు మనుమడు చెంచు వినీత్, అముదూరు మాజీ సర్పంచ్ వేముల రవి కుమార్తె చంద్రకళ వివాహం జరిగింది. వారిని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆశీర్వదించారు. అదేవిధంగా బాలాయపల్లి మండలంలోని సిద్ధాగుంట శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వెంకటగిరి 13వ వార్డు కౌన్సిలర్ కాసా కృష్ణమూర్తి కుమార్తె షణ్ముఖప్రియ, మధుసూదన్‌రెడ్డి వివాహం జరిగింది. వారిని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆశీర్వదించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నాయుడుపేట టౌన్: పదో తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు గురువారం మొదలియార్ సంఘం ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. పట్టణంలోని విశ్వం కళాశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పళని మొదలియార్ మాట్లాడుతూ తమ సంఘం ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మొదలియార్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కరీంబాయి చెంచయ్య, మధుసూదన్, ఆర్కాట్ వెంకటరత్నం, సాయిబాబా, కరీంబాయి హరిబాబు, పాజర్ల ప్రసాద్, లోకనాథం, రాజగోపాల్, లోడారి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణం జీఎన్‌టీ రోడ్డులో కొలువైన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టేటి పెరుమాళ్లు–గోవిందమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు చిట్టేటి రామదాసు, చిట్టేటి విజయ్‌కుమార్, కమిటీ గౌరవాధ్యక్షులు మాధవాచారి, వాకిచర్ల రమేష్, నూలేటి రమణయ్య, బట్టా సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి


రోగులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ ఆరి శంకరయ్య

వెంకటగిరి రూరల్: వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని 14వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఆరి శంకరయ్య కోరారు. ఆయన గురువారం సీహెచ్‌సీ, బంగారుపేట పీహెచ్‌సీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీహెచ్‌సీ వైద్యశాలలో నిర్వహిస్తున్న సదరం క్యాంపులో వైద్యులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. బంగారుపేట పీహెచ్‌సీలో 10 బెడ్లు ఉన్నా సరైన సేవలు అందడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పొగాకు వినియోగంతో క్యాన్సర్ ముప్పు


క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దక్కిలి: పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల నోరు, ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుందని వైద్యాధికారిణి బిందు ప్రియాంక తెలిపారు. మండలంలోని శ్రీపురం, లింగసముద్రం సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల్లో గురువారం స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళా తప్పనిసరిగా రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజు, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్య భాను, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.